జిందగీ

నేనొక కల కంటుంటాను. నేనీ వాక్యం చెప్పగానే.. 'ఆఫీసులో పనిచేయకుండా పడుకుంటే కలలే వస్తాయ్' అంటారు మీరు! నేను పట్టించుకోను. పడుకున్నా.. మేలుకున్నా.. నడుస్తున్నా.. ఆడుతున్నా.. ఆ మాటకొస్తే హిరణ్యకశిపుడు విధించిన క్లాజుల్లాంటివి సమస్తం జాబితా కట్టినా... ఆ వేళల్లో నేను సదరు కల కంటూనే ఉంటాను. ఆ స్వప్నానికి చిత్రిక పడుతూ.. మెరుగులు దిద్దుతూ ఉంటాను. ఆ కల ఎలాంటిదంటే...

నేను ఆందోళనలోనో, బాధల్లోనో, క్షోభలోనో ఉన్నప్పుడు ఆ కల గుర్తుకు వచ్చి గొప్ప ఊరట అనిపిస్తుంది. అప్పటిదాకా నన్ను మెలిపెడుతున్న వాటిని పూర్తిగా మరచిపోతాను.

నేను ఆనందంలోనో, ఉల్లాసంగానో ఉన్నప్పుడు ఆ కల గుర్తుకు వచ్చి 'బియాండ్ దీస్ ఫీలింగ్స్' ఒక చోట నన్ను నిలబెడుతుంది. తమాషా ఏమిటంటే... అప్పటిదాకా నాలో ఉన్న ఆనందాలను కూడా మరచిపోతాను.

బాధానందాలు కాని, హెచ్చుతగ్గులకు లొంగని ఒక తన్మయావస్థలోకి తీసుకెళు తుంది నన్ను.

ఎంతగా స్పృహలో ఉంటానో.. అంతగా అస్పృహలోనూ ఉంటాను. ఆ స్వప్నావస్థలో!

అదిగో మళ్లీ మీరు నవ్వుతున్నారు. 'కలలు కనే జబ్బే కాదురోయ్.. తమరిక్కాస్త వెర్రి కూడా ముదిరినట్లుంది' అంటారు.

బతకడం అంటే పరుగెత్తడం. గెలవడం కోసం పరుగెత్తడం, అలసిపోవడం. ఆ గెలుపులో సేదతీరడం. సేదతీరేలోగా మళ్లీ పరుగెత్తడం. అలుపు మనల్ని మింగేసే వరకు పరుగెత్తడం. అబ్బా... ఆ పరుగెంత నరకం.

జిందగీ ఏక్ దౌడ్!

'యే టూటేగా నహీ' అనుకున్న బంధాలు హఠాత్తుగా పుటుక్కుమంటాయి.

అయాచితంగా కొన్ని అక్కున చేర్చుకుంటాయి. 'మన/నా' అనే పరిధి నిత్యచంచలంగా అనుభూతిలోకి వస్తుంటుంది.

జిందగీ ఒక అబ్రకదబ్ర!

జీవితం ఒక ఆట. అది మనల్ని ఎడాపెడా ఆడేసుకుంటూ ఉంటుంది. మనం అదే స్థాయిలో దానిని చెడామడా తిట్టుకుంటూ, దానిలోంచి బయటకురాకుండా సహవాసం చేస్తుంటాం. తప్పదు గానీ.. ఎక్కడో ఒక చోట దానిని కాస్త పునర్నిర్వచించుకోవాలనే ఆశ ఉండాలి. అది మనల్ని, మనతో ఆడుకునే రోజుల్నించి పారిపోవాలి. మనం వేటికైతే బానిసలైపోయామో వాటికి పాతర వేయాలి. ఇక దాని ఆటలెలా సాగుతాయి?

అన్నీ అది క్రీడించినప్పుడు మనం నేర్చుకునే నిర్వచనాలేనా? వీటిని అధిగమించగానే, జిందగీ ఏమిటో నేను చెబుతాను. నవ్వొద్దులే నేనేమీ ఉడుక్కోను. ఆ కల దగ్గరికే వస్తున్నా.

పరుగు ఆపాక, ఇచ్ఛను పిడికిట పట్టాక, మాయను ముక్కలు చేశాక.. ఈ జిందగీని విసర్జించాక.. ఆ కల మొదలవుతుంది.

ఎక్కడో నగరానికి.. నిద్దర్లేవక ముందునుంచీ, నిద్దరపోయిన తర్వాత కూడా పరుగులు తీస్తూనే ఉండే జీవితాలకి.. భయాలకి.. ఆందోళనలకి.. ఆవేశాలకి.. అసూయలకి.. దూరంగా ఎక్కడో...

నాకొక పొలం ఉంటుంది. వందల ఎకరాలలో విస్తరించినది కాదది. ఒక జీవితం నిమ్మళంగా సాగిపోవడానికి తగినది, చిన్న కమతం. నా కష్టం కింద ఒదిగేంత మాత్రమే వ్యాపించినట్టిది. అక్కడ కనీస జీవనానికి, ఉదరపోషణకి అవసరమయ్యేవి మాత్రమే పండుతుంటాయి. వ్యాపారానికి కాదు.. సొంతానికి సరిపడా పండితే మాత్రం సరిపోతుందని అనుకుంటూ సాగు చేస్తుంటాను.

ఆ పొలంలోనే నేనుండే ఇల్లు ఉంటుంది. అంతస్తులుగా కాదు. అవసరానికి సరిపడా ఉంటుంది. ప్రదర్శనకు కాదు.. ఆశ్రయంగా మాత్రమే ఉంటుంది. ఏసీల్తో బయటి గాలి చొరబడకుండా సొంతం దిగ్బంధనం చేసిన ఇల్లు కాదది. ఏది లోపలో.. ఏది బయటో తెలియకుండానే కలిసిపోయి ఉండే ఇల్లు. గాలీ వెలుతురూ ధారాళంగా ఆడుతూ ఉండే ఇల్లు. రుతువులను, వాతావరణాన్ని బలవంతంగా శాసించేలా కాకుండా, వాటితో మమేకమై మన జీవితమూ ఒదిగి ఒదిగి నడుచుకునేలా మనల్ని ట్యూన్ చేసే యిల్లు.

నా కలను నమ్మే నాదైన ప్రపంచం నాతో ఉంటుంది. తిండి ఒక యావగా కాదు..

హాబీగా ఉంటుంది. పని ఒత్తిడిగా కాదు.. ముచ్చటగా ఉంటుంది. తినడం కోసం బతకడం కాదు.. బతకడం కోసం తినడం.. ఎంత ముసలిదైనా ఈ నీతి నీతే. ఏదైనా తినాలనుకుంటే అలా తోటలోకి వెళ్లి రాలినదో, కోసినదో తెచ్చుకుంటాను.

మార్కెటు కెళ్లినప్పుడు చీప్‌గా ఉన్నప్పుడు, 'ఆరోగ్యానికి చాలా మంచి'వని, ధర మండిపోతున్నప్పుడు 'వీటిని మురికి గుంటల్లో సాగు చేస్తార్ట' అని అంటూ విరుద్ధ ఆత్మవంచనల అవసరం లేకుండా.. కూరగాయలన్నీ ఇంటి పెరటి పాదుల్లో పెరుగుతుంటాయి. పచ్చిగా తినగలిగేవన్నీ తోటలో ఉంటాయి. మనం ట్యూన్ చేయాలేగానీ, జానెడు పొట్ట కాస్తా పిడికెడు మెతుకులతో తృప్తిపడేలా ఖచ్చితంగా తీరుతుంది. పొద్దెక్కిన తర్వాత పొయి రాజేసిన తర్వాత.. ఎంచక్కా ఆ పెరటితోటలోకి వెళ్లి నాలుగు కూరగాయలు తెంపుకు వచ్చి.. అప్పటికప్పుడు వండుకుంటాను. అంతే తప్ప.. ఫ్రిజ్ వారం నుంచి గడ్డకట్టిపోతున్న వాటిని వాడే అగత్యం రానివ్వను.

ఓ చిన్న తోట ఉంటుంది. నాక్కావలసినవి గరిష్ఠం అక్కడే పండిస్తాను. పొద్దున్నేవగానే వెళ్లి ఆ మొక్కల్నీ, పాదుల్నీ పలకరిస్తాను. మార్నింగ్ వాక్ కోసం ఓ నాలుగు కిలోమీటర్లు కార్లో వెళ్లి, పార్కు మధ్యలో గచ్చుదారిని వెతుక్కుని పావుగంట నడిచి తిరిగి రావాలా? నింపాదిగా ఒక్కో మొక్కనీ పలకరించుకుంటూ చివరికంటా మట్టిని పాదాలతో తడుముకుంటూ వెళ్లి వస్తాను. ప్లాస్టీకు సంచుల్లో కాకుండా, పొదుగుల్లో ఉండే పాలను పచ్చిగా కూడా రుచిచూస్తాను. పిట్టలు అరుస్తోంటే వసారాలోంచి కళ్లు మూసుకుని ఆస్వాదిస్తాను. ఫ్యాను తిరక్కుండానే గాలి పీలుస్తాను.

కుటుంబంతో ముడిపడి ఉన్నా సరే.. ఒక జీవితం గడిచిపోవడానికి ఏం కావాలి? ఎంత కావాలి? నాకున్న ఆ కొద్దిపాటి క్షేత్ర సామ్రాజ్యంలో ఆ కృషిని సాగిస్తుంటాను. సమస్తం అక్కడే పండాలి. నా రెక్కల కష్టం మీదనే సాగుతుండాలి. కాలాన్ని బట్టి జీవికకు మించి మిగిలిపోయేన్ని కూరగాయలు, పండ్లు పండే ఏర్పాటు చేసుకుంటాను. ఎంచక్కా ప్రతినిత్యం వాటి పోషణలో.. నా వ్యాపకాన్ని తీర్చిదిద్దుకుంటూ ఉంటాను.

నా ప్రపంచంలోకి తొంగిచూడడానికి మిత్రులు వస్తారే.. ఎంచక్కా రెండు బారలుండే పగుళ్లు లేని అరటి ఆకును పరచి.. తలోపక్కనా కూర్చుని బృంద విందు ఆరగిస్తే ఎంత మజా ఉంటుంది?

మిత్రుల రాకడంటే గుర్తొస్తోంది.. మరో మాట ఉన్నదిక్కడ. ఆ నా సామ్రాజ్యంలో.. సంకేతమాత్రంగా కూడా కనిపించనివి రెండున్నాయి. అవి, సంపదగా పరిగణనలో ఉండే- డబ్బు, బంగారం. పొరబాట్న కూడా వాటిని అక్కడ ఉంచుకోను. సంపద- మన వెంట ఎంత దండిగా ఉంటే, జీవితం అంతగా కుంచించుకుపోతూ ఉంటుంది. స్వేచ్ఛ, దానితో ముడిపడిన- దానిని ఇష్టపడే జీవితేచ్ఛ హరించుకుపోతూ

ఉంటుంది. అందుకే ఆ రెండింటినీ పూర్తిగా దూరం ఉంచుతాను. అవి మనతోనే ఉన్నంతకాలమూ.. మన బతుకుకు అవి ఉపయోగపడడం తర్వాత.. వాటిని కాపాడడానికి మనం బతకాల్సిన పరిస్థితి వస్తుంది. డబ్బు లేకుండా తీరని అవసరాలు తలెత్తినప్పుడు.. అవసరమైనంత వరకు బ్యాంకు నుంచి పుచ్చుకుని.. తిరిగి కార్డును మాత్రం దాచుకుంటాను. చెల్లింపులు బదలాయింపులు గట్రా కంప్యూటరులోంచే సాగిస్తుంటాను. చేతికి అంటే రూపంలో వాటిని ఉంచుకోను గాక కోను.

నా అడవిలో గడపడానికి మిత్రులు ఎపుడైనా వచ్చేప్పుడు ప్రత్యేకంగా హెచ్చరిస్తాను. ఆ రెండూ లేకుండా రమ్మని. అవి ఉన్నంతవరకూ... మనచుట్టూ ఓ భయం ఆవరించి ఉంటుందని. వచ్చిన వాళ్లని నా అతిథులుగా కాదు.. కా స్వప్నానికి అతిథులుగా ఆదరిస్తాను. నా కలలో ఉండే మధురిమనంతా వారికి అనుభవంలోకి తెస్తాను. గంటో రోజో వారమో.. వారు ఉండే కాలం.. ఆ పొలంలో.. పాదుల మధ్య, మొక్కల మధ్య చెట్ల మధ్య తిప్పుతూ.. అక్కడే సేద తీరుతూ కబుర్లు చెప్పుకుంటూ.. కాలహరణానికి కొత్త బాట చూపిస్తాను. వారు తిరిగి వెళ్లే సమయాల్లో.. నా కల అందించే దిగుబడిలో వారికి నచ్చినవన్నీ మూటగట్టి సారె పంపుతాను.

ప్రపంచం ఏమైపోతుందో తెలియని అజ్ఞానం ఆవరించకుండా.. ఓ ఇంటర్నెట్‌ను ఉంచుకుంటాను. ప్రపంచంలోనే బతుకుతున్నాననే స్పృహను కాపాడుకుంటూ ఉంటాను. ప్రపంచంలో ఏం జరుగుతున్నదో ఎరికపడుతూ ఉంటాను.

ప్రపంచాన్ని నేను పలకరించాల్సి వస్తే యాతన లేకుండా, ఓ మొబైల్‌ను సొరుగులో దాచిపెడతాను. మొబైల్ అంటే అది నా జీవితాన్ని శాసించడానికి, నా జీవితంతో ఆడుకోడానికి కాదు.. అది ఉండేది నేను వాడుకోడానికి. అందుకే.. దాని పేరు మొబైల్ అయినా.. దాన్ని బతుకుకు గొలుసులతో తెగకుండా ముడివేసి తిరగను. ఉదయమో సాయంత్రమో నిర్దిష్టంగా దానికి వేళల్ని కేటాయించి.. అదనంగా తీరిక వేళల్లో సొరుగులోంచి తీసి అందులో నన్ను పలకరించడానికి ప్రయత్నించిన ఆప్తులెవరైనా ఉన్నారా.. వారు నాతో చెప్పదలచుకున్న సందేశాలేమైనా ఉన్నాయా దేవులాడుతాను. ఆ ఖాళీ సమయాన్నంతా వారితో మాట్లాడతాను. వారి సందేశాలకు సదుత్తరాలిచ్చేస్తాను. అంటే.. రోజులో నాకంటూ ఒక 'మొబైల్ టైం' కేటాయించుకుంటాను.. అంతే తప్ప అహోరాత్రాలూ నా ఏకాంతాన్ని భంగపరిచే డికెష్టీ అవతారమెత్తడానికి నేను దాన్ని అనుమతించను.

అప్పుడప్పుడూ అవసరం అవుతుంది. ఉరుక్కుంటూ పని ప్రాంతాలకు వచ్చి ఒహటో రెండో రోజులు పరుగెత్తీ పరుగెత్తీ, తిరిగి నా ప్రపంచంలోకి పారిపోతాను. ఆ ఒకటిరెండు రోజులూ ఉదరపోషణకు తప్పనిసరి అయిన పనులలోనే గడుపుతాను. హద్దు దాకా పరుగెత్తి.. హద్దు దాటకుండా.. విరామం తీసుకుంటాను. తిరిగి నా కలల వేదికలోకి చేరుకుంటాను.

నా జీవితాన్ని నేను తిట్టుకోకుండా, ఛీఛీ ఏంటో ఈ జీవితం అనే చిరాకులు స్ఫురించకుండా.. అలా బాధానందాల స్పృహ, ప్రస్తావన లేని స్థితిలోకి పడతాను. ఇంకా..

-అదిగో మళ్లీ నవ్వుతున్నారు. 'నీకు వెర్రి కాదురోయ్, కొంత ముదిరి పచ్చిపచ్చిగా ఇప్పుడే పిచ్చి రూపంలోకి పరావర్తనం చెందుతున్న.. చెం..దు..తు..న్న.. అదొక ఇది' అని మీరంటారు. అవును.

ఇది నా బిందగీ కలగా మిగలనివ్వను.

... సాక్షి ఫ్యామిలీ